# సంహిత – 2

మనలో నున్న జ్ఞానమొక గిజిగాని గూడు. మనమెన్ని విద్యలనునేర్చినను, అవి వేరువేరుగా నుండక, అన్నియు కలసి ఒక్కటే రూపము. సంహితా రూపము. కాని, కావలసినపుడు ఏ విద్యకావిద్యగా, ఏ అనుభూతి కా అనుభూతిగా, ఏ సంఘటన కా సంఘటనగా వెలికి తేగలుగుచున్నాము. మనయందు ఆ కలసి ఉన్న జ్ఞానమును, దేనికదిగా విడదీయగలిగిన శక్తి ఉన్నది. దానిని ఊహ తరువాత ఊహగా మనస్సునకు తెచ్చునట్టి శక్తి ఉన్నది. ఆ ఊహలను ఇతరులకు తెలుపుటకు అక్షరములతోడి శబ్దములుగా మార్చగలము. కనుక లోనున్న జ్ఞానము వెలికి అక్షర రూపముగా వచ్చుటకు మనయందొక క్రమమైన పద్ధతి ఉన్నది గదా!

ఆ విధముగనే, వినిన అక్షరములు లోనికి పోయి జ్ఞానరూపమును పొందుచున్నవి. వినిన అక్షరమును జ్ఞానముగాను, లోనున్న జ్ఞానమును అక్షరముగాను మార్చునది ఏది? మన మనస్సు. ఈ మనస్సు అటు జ్ఞానమును, ఇటు ప్రాణమును అంటి పెట్టుకొని ఉన్నది. ప్రాణశక్తి వలననే అక్షరములను బయటకు వచ్చుట. ప్రాణశక్తి వలననే అక్షరములను వినగలుగుట. కనుక ఈ ప్రాణ, జ్ఞాన, మనస్సులు ఒక విచిత్రమైన సంహిత (కూడిక). మన బ్రతుకీ ముక్కాలిపీటమీద నిలబడి ఉన్నది.

ప్రాణమయిన గాలి, మనస్సు పలుకవలెనినన ఇచ్ఛ కలిగినపుడెల్ల ఒక్కొక్క గాలిపిల్లను బయటకు ఊదుచున్నది. ఆ గాలిముక్క కంఠనాళములయందు ధ్వనిగా మూరుచున్నది. మనస్సు కావలసిన అక్షరప్రకారము నాలిక, పెదిమలు, దవడలను కదల్చి వెలికి రావసిన జ్ఞానమున కనువైన అక్షరమును సృజింపుచున్నది. దీనికి వాగ్వ్యాపారమని పేరు కదా!

మనస్సు, లోనున్న జ్ఞానసంహిత యనిన గిజిగాని గూడు నుంచి ఒక్కొక్క తీగను వేరు చేసి క్రమముగా అక్షర రూపమును పొందించుచున్నది. అటులనే వినిన అక్షరములనుగాని, చదివినప్పటి అక్షరములనుగాని, తీగ చేసి లోని గూటిని చేర్చుచున్నది. సంహితను విడదీయుట, క్రొత్త విషయమును సంహితయందు జేర్చుట మనస్సు నిత్యము చేయు పని.

వేదము మనస్సుచేత, మనస్సు చేయగల పనిని చేయించి, వేదాక్షరముల యందలి జ్ఞానమును మన జాన సంహితను చేర్చు ఉపాయము, సులువును ఏర్పరచినది. దాని పేరు అధ్యయనము. వేదము నధ్యయనము సేయు నపుడు, అర్థము తెలిసి పలికిన వేదాక్షరజ్ఞానమును మనస్సు తన చేతులమీద మోసికొనిపోయి, మన జ్ఞాన భాగమున కందించును. జీవితమంతయు వేదమధ్యయనము సేయగా, క్రమముగా అక్షరమైన వేదజ్ఞానము మనము పొందుదుము. ఆ జ్ఞానమెంత సిద్ధించిన అంత ఉత్తమస్థితిని పొందుదుము.

ఈ మనస్సనిన పదార్థముకన్న విచిత్రమైన వస్తువు ఇంకొకటి ఉండదు. ఎందుకనగా, ఒక చెవిన వినిన అక్షరమునుగాని, మాటనుగాని, రెండవ చెవిఎంట బయటకు పంపుట దాని అలవాటు. తానున్న శరీరములో తన వెనక కూర్చొని ఉన్న తనదైన జీవి మాట తప్ప తక్కిన మాటలను పాటింపకపోవుట, దాని ప్రథమలక్షణము.

లోనున్న జీవికంటె అధికమైన ప్రజ్ఞగలవాని మాటలను వినినపుడు తాత్కాలికముగ ప్రభావితమగును. ఆవేశము పొందును. కాని అది కూడ కొంతకాలము వరకే. ఒక మహాకవి కావ్యము చదివినపుడు, ఒక గొప్ప గాయకుని సంగీతము వినినపుడు, ఒక గొప్ప ప్రవక్త సూక్తులు వినినపుడు, మనస్సు ఉత్తేజితమగును. ఆవేశపూరితమైన మనస్సు పోయి జ్ఞానమును కుదించును.కదలిన జ్ఞానము వలన లోనున్న జీవికి యికముందు యిప్పటికన్న అధికమైన జీవనము గడపవలెనన్న ఇచ్ఛ కూడ కలుగును. కాని ఆ ఇచ్ఛ తాత్కాలికము. ఆచరణలోనికి రాదు. ఎందువలన?

మన భోగభాగ్యములను నిర్ణయించునవి మన చేతలు గదా! ఆ చేతలు మన ఊహలవలన కదా, సంభవించుట!

ఆయా ఊహలు పుట్టుటకు కారణము మనము కాదు. మనమే కారణమైనచో ప్రయోజనము లేని, ఫలింపని ఊహలను గాని, పనులనుగాని చేయనే చేయము. ఫలింపని పనులను కూడ చేయుచున్నా మనగా, ఆయా చేతల, ఊహలకు కారణమైన మన జ్ఞానము మీద మన ప్రభుత్వము లేదు. దానిని మనము మార్చలేము. మార్చగలిగినచో, తండ్రిని కాదను పుత్రుడుండడు. మనమందరమును రామకృష్ణపరమహంసవంటి వారల బోధలను అనుసరించి తీరుదుము. వేమన్నగారు గీసిన తేటతెల్లమైన నీతిగీతలను దాటము.

మన ప్రవృత్తి మారుటలేదనగా, వారి ప్రవచనములు, ఆ ప్రవృత్తికికారణమైన జ్ఞానసంపుటిని కదల్చుటలేదు; మార్చుట లేదు. మన బ్రతుకును, ఆ బ్రతుకు తీరునకు కారణమైన మన జ్ఞానమును మార్చగలిగిన శక్తులను వేదము దేవతాశక్తులనినది. ఆ శక్తులును మనయందే ఉన్నవి. వేరుగా ఎక్కడనో లేవు. వాటిని మేల్కొలిపి, జ్ఞానపు గూడునకు పోయి, అచ్చటి జ్ఞానభాగముల నన్నిటిని సమైక్యపరచి, పలుతీరులుగా కాక, ఒకే నియమిత మార్గమున నడిపింప గలిగినవి వేదమన్త్రములు.

**అన్యోన్యంతు నహిగ్ం స్రాతః**
**సతస్తద్దేవ లక్షణమ్** – కృష్ణయజుర్వేదారణ్యకము. (1-6)

ఒకదాని నింకొకటి హింసింపకుండ చూచుట దేవలక్షణము. మనలో నున్న శక్తులను ఒకదాని కొకటి విరుద్ధముగా ప్రవర్తింప చేయకుండుట దేవలక్షణము. అనగా మన ఊహలయందు హింసాకరములు, ఫలనాశన కారకములైన ఊహలను పుట్టించకపోవుట దేవలక్షణమని భావము.

కనుక మన్త్రములు మనసు ద్వారా లోనికి పోయి దేవతాశక్తులను జ్ఞానభాగమునకు చేర్చవలెను.

లోనున్న భావమును, జ్ఞానమును సరియైనమాటలతో తెలియజెప్పగలుగుట దేవతాశక్తి. అనగా, మానవశక్తికి మించినది. అది మానవశక్తియే అయినచో మనమందరమును మహోపన్యాసకులమును, ఉత్తమగ్రంథకర్తలము అయ్యెడి వారము కదా!

అర్థపుష్టి గలిగిన మాటయే కాదు; వట్టి అక్షరములను బాగుగా నుచ్చరించుట కూడ అందరకు సాధ్యమయిన పని కాదు. ఎంత తీవ్రముగా అభ్యాసము చేసినను, విస్పష్టముగా అక్షరములను పలుకగలుగుట, కొందరికి సాధ్యము కాదు. వారి నాలుకలు ముదగ్గా నుండును. వారి దవడలు, తక్కిన ముఖావయవములు విస్పష్ట అక్షర ఉచ్చారణకు అనువుగా నుండవు. వాగ్వ్యాపార మంతయు దేవతాశక్తి.

దేవతాశక్తి ఫలితమైన వాగ్వ్యాపారమును మనము దైనందిన వ్యాపారమునకు ఉపయోగించుచున్నాము. ఉచ్ఛ్వాస, నిశ్వాసములు బ్రతుకుటకెంత ముఖ్యమో, లోనున్న గాలి వాగ్రూపముగా బయటకు వచ్చుటకూడ, అంత ముఖ్యము. మొదటి వ్యాపారము ప్రాణము నిల్చుటకు; రెండవది ఆ ప్రాణము, అర్థవంతముగా నిలబడుటకు.

వాగ్వ్యాపారము ప్రాణిని అర్థవంతము సేయుచున్నది. అనగా, లోనున్న అర్థమును (జ్ఞానమును) వెలికి తెలియజెప్పుచున్నది. అనగా వాక్కు జ్ఞానమునకు దగ్గర బంధువు. కనుక మన జ్ఞానమును పెంచదలచినచో వాక్కును ఉపయోగించుట సమంజసమైన పద్ధతి. గురువు మనకు బోధించుట, ఉపన్యాసకులు తెలియజెప్పుట వారి వాక్కు వలననే కదా!

అర్థమును తెలియజేయు వాక్కు అక్షరాశ్రయితము. అక్షరములు కూడి మాటలై, ఆ మాటలు లోకములోని వస్తువులకు, చేతలకు గుర్తులై, ఆ మాటల కూర్పు వాక్యములై ఒకని అర్థము, భావము, జ్ఞానము మరియొకనికి తెలియుచున్నదిగదా! అక్షరముల కూడిక మాట యగుట, అక్షరసంహిత; ఆ శబ్దముల కూర్పు వాక్యమగుట శబ్దసంహిత.

ఈ వినిన మాటల, చదివిన వాక్యముల, చూచిన వస్తువుల, అనుభవించిన అనుభవముల, తాత్పర్యము, అర్థము, ఉపయోగములను తెలిసికొని, ఇదివరకు ఉన్న జ్ఞానపుముద్దతో కలిపి పెద్దముద్దను సెయగలుగుట జ్ఞానము సేయు పని. అనగా జ్ఞానమునకుగూడ సంహితా శక్తి ఉన్నదనిన మాట.

మనలో నున్న జ్ఞానమును గూర్చి వేదము విదితముగా తెలియజెప్పినది. మనకున్న జ్ఞానము ధ్యానముచేత విజ్ఞానము అగును. ధ్యానము అనిన మాటకు వేదభాషలో అర్థము వేరు. అధ్యయనము అనగా వేదమన్త్రములను అర్థము తెలిసి పలుకుట. అధ్యయనము మనము సేయు యత్నము. క్రమముగా ఆ యత్నము ధ్యానమగును. ఆ ధ్యానము జ్ఞానమును విజ్ఞానము సేయును. వేదమన్త్రముల ధ్యానము వలన జ్ఞానస్థితినుండి విజ్ఞానస్థితిని పొందగలము.

**విజ్ఞానం వావ ధ్యానా ద్భూయో.** విజ్ఞానము ధ్యానమునుండి పైకి వచ్చును. (ఛాందోగ్యోపనిషత్తు, 7-1). ఆ విజ్ఞానమయస్థితిలోనే ప్రాణము, హృదయము, జ్యోతమయిన పురుషశక్తి అవగతమగును. ఇచ్చటనున్న పదములన్నియు వేదశబ్దములు. సంస్కృతశబ్దార్థములు చెప్పరాదు.

**యః అయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యంతర్జ్యోతిః పురుషః స సమానః లోకాననుసంచరతి** – ఆ పురుషునితో సమానముగా వర్తించును. (బృహదారణ్యకోపనిషత్తు, 43-13). విజ్ఞానమునందే సూక్ష్మశరీరములోని ప్రాణ, హృదయ, పురుషశక్తులు తెలియును.

సంజ్ఞానము దేవతాశక్తి. మానవుడు సాధించవలసినది. సంజ్ఞాన దేవతా ఋక్కులున్నవి.

**సంజ్ఞాన ముశనావదత్ సంజ్ఞానమ్ వరుణోఽవదత్**
**సంజ్ఞాన మిన్ద్రశ్చాగ్నిశ్చ సంజ్ఞానం సవితా వదత్**

(ఋగ్వేదము, 10-197-1, ఖిలమన్త్రము)

**సంజ్ఞాన మిన్ద్రశ్చాగ్నిశ్చ సంజ్ఞానం సవితా వదత్**

(ఋగ్వేదము, 10-197-1, ఖిలమన్త్రము)

సంజ్ఞానస్థితియందు దుఃఖమును కలిగించు పనులు సేయవలెనను భావములు రావు. సుఖప్రదములైన పనులు సేయవలెనను భావములె కలుగును. ఇన్ద్రశక్తి, అగ్నిశక్తి, వరుణశక్తి, సవితా శక్తుల స్వరూపము తెలియును.

వేదమన్త్రముల వలన గాని లోనున్న జ్ఞానమునందు మార్పురాదని వేదము చెప్పుచున్నది.

మనకు కలుగు ఊహలకు మూలమయిన జ్ఞానము పై పొరలలోనుండదు. పై పొరలలో, వస్తువుల జానము, దైనందిన వ్యవహారజ్ఞానముండును. మన ప్రారబ్ధ కారణమైన జ్ఞానము, అనగా మన మూడుదేహముల భోగభాగ్యము లకు కారణభూతమై, మన జీవితనావకు చుక్కానులవంటి ఊహలను కల్పించు జ్ఞానము అంతరాంతరములలో మన దైన జీవిని అంటి ఉండును. దానిని పోయి చేరుటకు మానవమాత్రుల మాటలు చాలవు. సకల చైతన్యము యొక్క ప్రతిరూపములైన అక్షరములు కావలెను. ఆ అక్షరమునకు మన వాక్కునందున్న లక్షణములన్నియు నుండవలెను. సంగీతము, ఉదాత్త, అనుదాత్త, స్వరిత శక్తి, సంహితా లక్షణము (పై పైనగాక, లో పొరలలో చొచ్చి ఒకటి యగు శక్తి), మనస్సుపొందగలిగిన అనేక స్థితులకు అనువైన రాగములతో కలసి ఉండుట, వంటి లక్షణములన్నియు వేదాక్షరముల కున్నవి. వేదాక్షరములు సర్వమానవాళి ఉచ్చరించు అక్షరములకు మూలభూతములు.

అందువలన వేదాక్షరమునకు అక్షరము పుట్టెడి చోటునకు పోగలిగిన శక్తి ఉన్నది. ఆ శక్తి వేదము కల్పించిన ఉదాత్త, అనుదాత్త, రాగములవలన కలిగినది. కనుక, వేదాక్షరము మాత్రమే మన జ్ఞానమును, విజ్ఞాన-సంజ్ఞాన స్థితులను పొందింపగలదు. మన ఊహలు పుట్టు చోటునకు పోయి, వాటిని మలచగలదు.

వేదాక్షరమునకు చెవినుండి లోనికి పోయినది మొదలు, జ్ఞానపు గూడు చేరువరకు మనస్సును అంటిపెట్టుకుని ఉండు శక్తి ఉన్నది. జ్ఞానమును చేరి, దానితో ఏకమైపోగలిగిన శక్తి ఉన్నది. జ్ఞానపు లోపొరలలో పుట్టు ఊహలలో కలసిపోగలిగిన శక్తి ఉన్నది.

వేదాక్షరము జ్ఞానముతోడ కలసిపోవుట అక్షర సంహిత. వేద ప్రయోజనమంతయు ఈ అక్షరసంహితమీద ఆధారపడి ఉన్నది. అందువలన వేదము **శృతి.** వేదారంభభాగములు సంహిత. వేదమన్త్రముల ప్రయోజనము మనయందు దేవతాశక్తులను సంహిత సేయుట.